క్లుప్తంగా

కాకతీయనగర్ సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ విద్యుత్‌లైన్



విద్యుత్ లైన్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి -1 సబ్‌స్టేషన్ నుంచి దేవునిపల్లి కాకతీయ నగర్ సబ్‌స్టేషన్ వరకు కొత్తగా నిర్మించిన 33 కేవీ ఇంటర్ లింక్ లైన్‌ను సోమవారం ఎస్ఈ శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఈ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతు.. కాకతీయ నగర్ సబ్‌స్టేషన్‌కు కొత్త లైన్ ద్వారా ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అవుతుందని, దీంతో చిన్న మల్లారెడ్డి ఫీడర్‌పై భారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో డీఈ కళ్యాణచక్రవర్తి, ఏడీఈ కిరణ్‌చైతన్య, ఆపరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బాన్సువాడ : ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అడ్మిషన్ల కోసం ప్రచారం చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఎల్ఎస్‌వో, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేసి అడ్మిషన్లు చేసుకుంటున్న ఓ విద్యా సంస్థపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు రఘురాం, జీవన్, అజయ్, వంశీ తదితరులు ఉన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న చంద్రకాంత్ రెడ్డి



రాజంపేట:మండల కేంద్రానికి చెందిన దొమ్మట భవాని తన కూతురు పెళ్లికి ఏమైనా సహాయం అందించాలని గత శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం రోజున జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డిని కోరింది. దీంతో ఆయన తన వంతు సహాయంగా పుస్తె మట్టెలు అందిస్తానని మాట ఇచ్చారు. సోమవారం భవాని కూతురు గీతా వివాహానికి పుస్తె మట్టెలు అందజేసి ఆయన ఇచ్చిన మా ట నిలబెట్టుకున్నారు. పార్టీ మండలాధ్యక్షు లు యాదవరెడ్డి,సుధాకర్‌రెడ్డి,బెస్తచంద్రం, సాయిబాబా పటేల్, అంకం రాజు తదితరులున్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్



మాట్లాడుతున్న ఎంఈవో దేవిసింగ్

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గత 20 రోజుల నుంచి నిర్వహించిన సమ్మర్ క్యాంప్ సోమవారంతో ముగిసింది. ఈసందర్భంగా ఎంఈవో దేవిసింగ్ మాట్లాడుతూ క్యాంప్‌లో భాగంగా విద్యార్థులకు ప్రతిరోజు ఆటలు ఆడిస్తూ ఆహ్లాదకరంగా శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ, కృష్ణ, సీఆర్పీ హైమద్ పాషా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి, షబ్బీర్‌అలీల చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

భిక్కనూరు:మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీల చిత్రపటాలకు సోమవారం పాలాభిషేకం చేశారు.గ్రామంలో నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేసినందుకు గాను లబ్ధిదారులు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, డీసీసీబీ మాజీచైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, నేతలు వినోద్‌గౌడ్, కుప్రియాల శ్రీనివాస్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు మద్ది సూర్యం, చేపూరి రాజు, తక్కళ్ల బాపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బస్టాండ్‌లో ధ్వంసమైన ఫ్లోరింగ్



నిరుపయోగంగా మారిన షటర్లు



చెత్తతో నిండిపోయిన మరుగుదొడ్లు

ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యల తిష్ట

- సదాశివనగర్‌లో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని వైనం
- పిచ్చిమొక్కలతో నిండిపోయిన మరుగుదొడ్లు, మూత్రశాలలు
- రాత్రి వేళలో మందుబాబులకు అడ్డాగా మారిన పరిస్థితి
- అధ్వానంగా మారి, నిరుపయోగంగా తయారైన షటర్లు
- పట్టించుకోని అధికారులు



సదాశివనగర్ ఆర్టీసీ బస్టాండ్



పిచ్చిమొక్కలతో పేరుకుపోయిన స్త్రీల మూత్రశాలలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి):మండల కేంద్రంలో 35 ఏళ్ల క్రితం నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ లో సమస్యలు తిష్ట వేశాయి. అప్పట్లో ప్రయాణికులతో కిటకిటలాడేది. పదేళ్ల క్రితం 44వ జాతీయ రహదారి విస్తరణ చేపట్టినప్పటి నుంచి బస్టాండ్‌లోకి బస్సులు రాకపోకలు సాగకపోవడంతో ఆ ప్రాంతం అంతా చెత్తచెదారంతో నిండిపోయింది. పిచ్చి మొక్కలు పేరుకు పోయాయి. దీనికి తోడు అసాంఘికకార్యకలాపాలకు అడ్డాగా మారింది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు తప్పకుండా బస్టాండ్‌లో నుంచి వెళ్లాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో డ్రైవర్లు, కండక్టర్లు సర్వీస్ రోడ్డు గుండా వెళ్లే ప్రతి బస్సును బస్టాండ్‌లోకి తీసుకెళ్తు ప్రయాణికులను దింపుతూ, ఎక్కించుకుంటున్నారు. బస్టాండ్‌లో కనీసం కూర్చుందామంటే బెంచీలు లేకుండా పోయాయి.

వసతులు కరువు

బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస మౌలిక వసతులు లేవు. నీటి వసతి లేదు. ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్లను వినియోగించకపోవడంతో పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లేలా చూసిన అధికారులు ఈ సమస్యలపై దృష్టి ఎందుకు పెట్టడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. బస్టాండ్‌లో బండలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. కిటికీలు పగులగొట్టారు. షట్టర్లు ఊడగొట్టారు. దీంతో ఉన్న నాలుగు షట్టర్లు నిరుపయోగంగా మారాయి. ఈ షట్టర్లు రాత్రి వేళలో మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బస్టాండ్‌లో నీటి వసతి ఏర్పాటు చేసి, మూత్రశాలలు, మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పట్టించుకోకనే బస్టాండ్ గిట్ల ఉంది



చాలా ఏళ్లుగా ఈ బస్టాండ్ గిట్లనే ఉంటుంది. నీళ్లు లేవు. పట్టించుకునేవారు లేకుండా పోయిండ్రు. మూత్రశాలలు కట్టియ్యాలే. సమస్యలను తీర్చాలే.

– కుర్మ మల్లయ్య, సదాశివనగర్

బస్టాండ్‌లోకి బస్సులు రావడం సంతోషమే



బస్టాండ్‌లోకి బస్సులు రావడం, పోవడం మంచిగానే ఉంది కానీ వసతులు ఏం లేవు. కూర్చోవడానికి బెంచీలు లేవు. ఉన్న బండరాళ్లు ఎత్తుకెళ్లిండ్రు. పట్టించుకునే వారు లేరు. అధికారులు పట్టించుకుంటే సమస్యలు తీరుతాయి.

– నిమ్మలబోయిన రాజయ్య, సదాశివనగర్

సమస్యలను పరిష్కరిస్తాం

ఆర్టీసీ బస్టాండ్‌లలో అక్కడక్కడ సమస్యలు ఉన్న మాట వాస్తవమే. నిధులు లేక కొంత ఇబ్బంది ఉంది. బస్టాండ్‌లు ఉన్న చోట తప్పకుండా బస్సులను బస్టాండ్‌లోకి తీసుకెళ్లాలని కండక్టర్, డ్రైవర్‌లకు సూచనలు చేయడం జరిగింది. నిధులు మంజూరు కాగానే సమస్యలను పరిష్కరిస్తాం.

– కరుణశ్రీ, ఆర్టీసీ డిపో మేనేజర్, కామారెడ్డి

నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు



గర్గుల్‌లో ఇందిరమ్మ ఇల్లుకు ముగ్గు పోసిన అధికారులు



కాటేపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లుకు భూమి పూజ చేస్తున్న నాయకులు

- మంజూరు పత్రాలు అందుకున్న వారు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి
- జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్

కామారెడ్డి రూరల్: ప్రభుత్వం పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని వాటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. సోమవారం కామారెడ్డి మండలంలోని గర్గుల్, క్యాసంపల్లి తండా, లింగాయిపల్లి, శాబ్దిపూర్, ఇస్రోజీవాడి, చిన్నమల్లారెడ్డి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ...ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు ఎలాంటి దిగులు చెందాల్సిన అవసరం లేదన్నారు.మంజూరు పత్రాలు అందుకున్న వారు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, కుమార్‌గౌడ్, కొల్మి భీంరెడ్డి, సిద్ధాగౌడ్, సురేష్‌గౌడ్, బంటు రాజు, భూంరెడ్డి, భైరవగౌడ్, పెద్ద గంగరాజు, మద్దెల శంకర్, గ్రామ కార్యదర్శి శోభరాణి,మమత తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ...

పెద్దకొడప్‌గల్/నిజాంసాగర్/బిచ్కుంద/రామారెడ్డి/రాజంపేట/ ఎల్లారెడ్డిరూరల్/ఎల్లారెడ్డి/ లింగంపేట/ సదాశివనగర్ : పెద్దకొడప్ మండలం కాటేపల్లి జగన్నాథ్ పల్లి, లింగంపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు ముగ్గు పోసి, భూమి పూజ చేశారు. మహమ్మద్ నగర్ మండ లంలోని ముగ్దుంపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి భూమి పూజ చేశారు. మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్, సింగితం గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.బిచ్కుంద మండలంలోని మాన్యాపూర్‌లో లబ్ధిదారులకు ఎంపీడీవో గోపాల్, కాంగ్రెస్ నాయకులు విఠల్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రం అందించారు. ముగ్గు వేసి పనులు ప్రారంభించారు. రామారెడ్డి మండలానికి 512 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని ఇప్పటికే 100 ఇళ్లకు ముగ్గు పోసి పనులను ప్రారంభించారని రామారెడ్డి ఎంపీడీవో తిరుపతిరెడ్డి తెలిపారు. అన్నారంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులను జీపీ కార్యదర్శి సాగర్‌గౌడ్ ప్రారంభించారు.రాజంపేట మండలంలోని పొందుర్తి, శివాయిపల్లి గ్రామాల్లోని లబ్ధిదారులకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి భూమి పూజ చేశారు. గాంధారి మండలం కరక్‌వాడీ, కాయితీ తండా గ్రామ పంచాయతీ పరిధి ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీవో రాజేశ్వర్ ముగ్గు వేసి పనులు ప్రారంభించారు. ఎల్లారెడ్డి మండలంలోని శివాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ పనులను ఎంపీడీవో ప్రకాశ్ పరిశీలించారు. ఎల్లారెడ్డిలో డబుల్ బెడ్‌రూంల కోసం దరఖాస్తులు చేసుకున్న కుటుంబాలకు సంబంధించిన వారి విచారణ పూర్తి అయిందని తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. 40 డబుల్ బెడ్‌రూంలకు సంబంధించి అర్హులు చాలా మంది ఉండడంతో లక్కీ డ్రా ద్వారా డబుల్ బెడ్‌రూంలకు ఎంపిక చేస్తామన్నారు. లింగంపేట మండలం మెంగారం, లింగంపేట, కొండాపూర్, కంచుమల్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు మార్కౌట్ ఇచ్చారు. అలాగే లబ్ధిదారులకు ఎంపీవో మలహరి మంజూరు పత్రాలు అందించారు.సదాశివనగర్ మండలం మర్కల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం మార్కింగ్ పనులనుకాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సంగారెడ్డి. జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు లింగాగౌడ్‌లు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, జీపీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పైనే మురుగు నీటి ప్రవాహం

- చిన్న వానకే బయటపడిన కామారెడ్డి బల్దియా నిర్లక్ష్యం



కామారెడ్డిలోని జన్మభూమి రోడ్డులో ప్రవహిస్తున్న మురుగు నీరు

కామారెడ్డి క్రైం: చిన్న పాటి వానకే మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం బయటపడింది. మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో కురిసిన చిన్నపాటి వర్షానికే మురుగు నీరు రోడ్లపై పారింది. దాదాపు అన్ని కాలనీల్లోనూ ఇలాంటి దుస్థితే కనిపించింది. వర్షా కాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో బల్దియా అధికారులు మురుగు కాలువలు శుభ్రం చేయించకపోతే దారుణమైన పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంది. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



చిన్న దేవిసింగ్ తండాలో చిత్తడిగా మారిన రోడ్డు

చిత్తడిగా మారిన రోడ్డు..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని చిన్న దేవిసింగ్ తండాకు వెళ్లే రోడ్డు చిన్నపాటి వర్షానికే చిత్తడిమారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత రాత్రి కురిసిన వర్షానికి రోడ్డు దారుణంగా తయారైంది.

లింగంపేటలో భారీ వర్షం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు కోమట్‌పల్లి,పోతాయిపల్లి, సురాయిపల్లి, అయిలాపూర్ తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా ఉక్కపోతగా ఉండి భారి వర్షం కురియడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. రైతులు పంట చేనుల్లో దుక్కులు దున్నడం ప్రారంభించారు. వర్షాకాలానికి 15 రోజుల ముందే వర్షాలు కురుస్తున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని కల్వరాల్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం 2005–06 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. గత జ్ఞాపకాలను గుర్తుకు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వీర హనుమాన్ ఆలయం ప్రారంభం



పూజలు చేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో పునర్నిర్మాణించిన వీర హనుమాన్ ఆలయాన్ని సోమవారం రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి ప్రారంభించారు. వేదపండితులు గోవింద్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో చేపట్టిన ప్రత్యేక పూజల్లో వీరు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి దేవాదాయ శాఖ రూ.24లక్షలు మంజూరుచేయగా, గ్రామస్తులు మరో 6లక్షలు విరాళం అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు మాలెపు నారాయణరెడ్డి, దేవారం నారాయణరెడ్డి, సాయిలు యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, ఉద్దర హన్మాండ్లు ,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనృసింహ స్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మాచారెడ్డి: చుక్కాపూర్‌లోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఈవో శ్రీధర్‌రావు, డైరెక్టర్లు లక్ష్మీరాజం, రాజిరెడ్డి, ఆలయ అర్చకులు నరసింహాచార్యులు, శ్రీనివాసాచార్యులు, పరంధామాచార్యులు, సంజీవాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో వేదపండితుల మంత్రాల మధ్య సోమవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మతల్లి, పెద్దిరాజు కల్యాణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.మాజీ ఎమ్మెల్యే సురేందర్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనవెంట సీనియర్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సిద్ధయ్య, మాజీజడ్పీటీసీ జయరాజ్, ఇతర బీఆర్ఎస్ నాయకులున్నారు.

తాడ్వాయిలో పోచమ్మ విగ్రహ..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో సోమవారం మెట్టు, మాదిగసంఘం ఆధ్వర్యంలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. శబరిమాత ఆశ్రమం నుంచి పోచమ్మ విగ్రహాన్ని ఊరేగింపుగా ఆలయం వరకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సంఘసభ్యులు మాట్లాడుతూ మంగళవారం ప్రతి ఇంటి నుంచి బోనాలను అందంగా అలంకరించి గ్రామంలో డప్పువాయిద్యాలతో ఊరేగింపు చేపడతామన్నారు. అలాగే శబరిమాత ఆశ్రమంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా ప్రారంభమైన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ఉత్తునూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను ఈ నెల 23 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా మడివేలి మాచయ్య స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భిక్కనూరు:మండల కేంద్రంలో మడివేలి మాచయ్య శీతాలమ్మ ఆలయం తొమ్మిదో వార్షికోత్సవాలు ఘనం ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రజక సంఘం ఆధ్వర్యంలో సోమ వారం మాచయ్య స్వామి–శీతాలమ్మ కల్యాణాన్ని వేదబ్రాహ్మణుల మంత్రాల మధ్య ఘనంగా నిర్వహించారు. మహిళలు స్వామివారికి అమ్మవారికి ఒడిబియ్యం,కట్నకానుకలను సమర్పించారు.సాయంత్రం మండల కేంద్రంలో పెద్ద ఎత్తున రజకసంఘం ఆధ్వర్యంలో బోనాల ప్రదర్శన నిర్వహించారు.

21 నుంచి ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కామారెడ్డి అర్బన్:పట్టణంలోని శ్రీపంచముఖి హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి 48వ వార్షికోత్సవాలు ఈనెల 21,22, 23 తేదీల్లో బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 22న ఆంజనేయస్వామికి అభిషేకాలు, నవగ్రహ హోమాలు, 23న శుక్రవారం ఉదయం 10గంటలకు వేంకటేశ్వరస్వామి కల్యాణం ఉంటుందన్నారు. పాల్గొనే భక్తులు సంప్రదించాలన్నారు.

నేడు వైశాఖ పూజ

కామారెడ్డి అర్బన్: స్థానిక సిరిసిల్లరోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం పంచముఖి హనుమాన్ దేవాలయంలో ఈనెల 20న మంగళవారం సిందుర పూజ, సాయంత్రం 6గంటలకు వైశాఖ పూజ, తీర్థప్రసాదాల వితరణ నిర్వహించనున్నట్టు పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తెలిపారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సంక్షిప్తం

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

బాన్సువాడ రూరల్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించే వృత్తి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల, కోనాబాన్సువాడ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ ఉంటుందన్నారు.

నేడు బాన్సువాడలో తిరంగా యాత్ర

బాన్సువాడ : ఆపరేషన్ సిందూర్ దిగ్విజయంగా సాగిన నేపథ్యంలో మంగళవారం బాన్సువాడలో తిరంగా యాత్రను నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. సైనికులకు సంఘీభావంగా సాయంత్రం 4 గంటలకు స్థానిక తహసీల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు యాత్ర కొనసాగనుందన్నారు.

శ్రీ వెంకటేశ్వర గ్రూప్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర్ హడత్ వ్యాపారుల ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మద్నూర్, డోంగ్లీ మండలాలకు చెందిన యువకులు మాత్రమే పోటీలో పాల్గొనాలని ఒక టీంలో ఆడిన ఆటగాడు మరో టీంలో ఆడరాదన్నారు. ఈ నెల 24వ తేదీ వరకు రూ.1100 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. ఎనిమిది, పది, 12 ఓవర్ల క్రికెట్ మ్యాచ్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.11వేల111, ద్వితీయ బహుమతిగా రూ.5వేల555 నగదు పురస్కారం అందిస్తామన్నారు. మద్నూర్‌లోని మార్కెట్ కమిటీ కార్యలయం పక్కన గల ఖాళీ మైదానంలో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 9705943595, 9000535638 ఫోన్ చేయాలన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ దివంగత నేత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కార్యదర్శి వర్గ సభ్యుడు కొత్త నర్సింలు, నేతలు ప్రవీణ్, నర్సవ్వ, శ్యామల,బాబుజాన్, హనుమాండ్లు, సాయిక్రిష్ణలు పాల్గొన్నారు.

రైతు గుర్తింపు కార్డు కోసం వివరాల సేకరణ



కన్నాపూర్‌లో రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవసాయాధికారులు

లింగంపేట/ఎల్లారెడ్డి: భూమి ఉన్న ప్రతి రైతుకు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు మండల వ్యసాయాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం లింగంపేట మండలంలోని పర్మళ్ల, కన్నాపూర్, లింగంపేట, కొర్పోల్ తదితర గ్రామాల్లో రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.ఎల్లారెడ్డి మండలంలోని కొక్కొండ గ్రామంలో వ్యవసాయ అధికారులు రైతు గుర్తింపు కార్డుకు సంబంధించిన వివరాలను సేకరించినట్లు ఏఈవో సతీశ్ తెలిపారు. ఏఈవోలు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.